★ 'చచ్చిపోవటం నేమాని వీరభద్రరావు

# అంత సుఖమైన పని కాదు!

సెప్టెంబరు నెలలో బాకీలన్నీ తీరుద్దామని తృప్తిపడుతూంటే, అనుకోని ఖర్చు ఒకటి మీద పడింది. దాంతో నా ఆర్థికసంబంధమైన లెఖ్ఖలన్నీ మార్చుకోవలసివచ్చింది. ఆ నెల తీర్చవలసిన బాకీలు కొన్ని అలాగే వుండిపోయాయి. ముఖ్యంగా షాహుకారు వెంకయ్య బాకీ. అందరూ మాటలద్వారా తమ భావాలను, పాండిత్యాన్ని లోకానికి తెలుపుతూవుంటే వెంకయ్య మాత్రం తన చూపులతోనే ఎన్నో భావాలను ప్రకటించి, ఆ భావసంపుటిని బాకీదారులచేత చదివిస్తాడు.

క్రిందటినెలలో అతనికి సొమ్ము యియ్యటం కొంచెం ఆలశ్యమయింది. ఒకటోతారీఖు సాయంకాలం మర్యాదగా పిల్చి 'ఏమండీ ఒకటి వెళ్ళి మూడువస్తూంది, యీనెల మావంక చూడరూ' అని విషపునవ్వు నవ్వాడు. ఎలాగైనా అయిదో తారీఖుకైనా యిస్తామన్న ధైర్యం వు దిగనుక అతని ధోరణిని హాస్యంలోకి ద్రింపి, 'వెంకయ్యా ఒకటికీ. మూడుకూ మధ్య రెండంటూవుందికదూ' అని మొండినవ్వు నవ్విపోయాను యీ నెల అలా. కనుగవని ఆమార్గం, మొదలికే వదలిపెట్టేసేను.

యీ సంగతులు మా యింట్లోవాళ్ళకి ఏం అర్థం అవుతాయి. పెరుగువాళ్ళకి, పాలవాళ్ళకి యివ్వలేదని పెద్ద ఆర్థికసంబంధమైన యుద్ధం లేవదీశారు. దాంతో నాలో నిరుత్సాహం బాగా ప్రవేశించింది. అలాటిసమయాల్లో నేను 'తాతగారూ' అని పిల్చే ఒక రిటైర్డు యినస్పెక్టరుగారి దగ్గరకుపోవటం అలవాటు. అలాగే ఆయన దగ్గరకు వెళ్ళేను.

ఆ అనుభశాలి నన్ను చూడగానే 'ఏరా, అబ్బీ ముఖం వేలవేశావ్' అన్నాడు. మెల్లిగా నా దగ్గర విషయమంతా లాగాడు. 'తాతా! యీ యీతిబాధలన్నీ పడలేను. చచ్చిపోతానన్నాను.' వెంటనే అయన 'వెర్రివాడా, నెహ్రూ తన ప్రపంచ చరిత్రలో చివరపేజీల్లో ఏమని వ్రాశాడో తెలుసునా? 'చనిపోవటానికి ఒక వ్యక్తి బలవంతంగా ప్రయత్నించాడంటే నిజంగా అతనిలో స్వార్థం యిమిడివుందన్నమాట. కనుక తప్పు' అని హెచ్చరించాడు. నీలాగే నాకూ పని రాని రోజుల్లో యీ బుద్ధి పుట్టిందిగాని మాతృప్రేమ ముందు ఆ నిశ్చయం గాలిలో కలిసింది' అన్నాడు తాత.

పెద్దల అనుభవాలు వినతగ్గవని వివరాలు చెప్పమన్నాను. ఆయన చెప్పటం మొదలు పెట్టాడు. 'అబ్బీ, ఒక కొండ వాడిదగ్గర చనిపోయేందుకు ఒక మాత్ర సంపాదించేను. బెదిరించవలసిలవాళ్ళని బెదిరించి, వప్పగింతలు వప్పగించవలసినవాళ్ళకి వప్పగించి, కడకు మా అమ్మదగ్గరకు వెళ్ళి నా నిశ్చయాన్ని చెప్పేను.

నిజంగా చచ్చిపోవాలనివున్నవాడు యివన్నీ చేస్తాడా? మా అమ్మ చచ్చిపోరా నాయనా అని అంటుందా? ఏ తల్లిమాత్రం అనగలదు? నా వెర్రిమాటలు వినేసరికి భయపడి ఆ వెర్రితల్లి 'నాయనా, నే ముష్టెత్తి నీకింత కాచిపోస్తాను' అని ఏడ్చింది. ఆ మాతృప్రేమ నా నిశ్చయాన్ని సగం గాలిలో కలిపింది. అవసరంపడినప్పుడు వుపయోగిద్దామని 'మాత్ర' దాచేశాను.

తరువాత వుద్యోగంవచ్చింది. సంసారంలో ఎన్నో లావాదేవీలు పడుతూన్నా మాత్రమింగలేదు. కడకు పాతికేళ్ళ కొడుకు పోయినా మాత్ర మ్రింగలేదు. నేడు పక్షవాతపు నొప్పులతో బాధపడుతూన్నా మాత్ర మ్రింగలేకపోతున్నాను.

కనుక నాయనా చచ్చిపోవటం అంత సుఖమైన పనికాదు. ఏదో ఒక ఆశ మనలను మాత్ర మ్రింగనియ్యదు" అని చెప్పగానే మళ్ళీ లోకంలో పడ్డాను. 'చనిపోవటం'లో యింత స్వార్థం, యింత కష్టమూ వున్నాయని మొదట తెలుసుకోలేదు.